తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
మంగళవారం
6 అక్టోబర్ 2026
పేజీలు : 08



Follow :




# శిథిలావస్థకు చేరిన కోట్‌పల్లి గ్రామపంచాయతీ భవనం

## నూతన భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు

**కోట్‌పల్లి, అక్టోబర్ 05 (జనసాక్షి):**
కోట్‌పల్లి గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు కాగా, నిర్మాణ పనులు ప్రారంభించి బేస్‌బీమ్ వరకు నిర్మించిన అనంతరం పనులను నిలిపివేశారు. దీంతో నూతన భవనం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న గ్రామపంచాయతీ భవనం పాతబడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కు సంబంధించిన పలు పనుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయానికి నిత్యం రాకపోకలు సాగుతుండటంతో భవనం పరిస్థితిపై వారు ఆందోళన చెందుతున్నారు. భవనంలోని పలు ప్రాంతాలు దెబ్బతినడంతో సిబ్బంది సైతం ఇబ్బందుల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నూతన భవనం మంజూరై నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ మధ్యలోనే నిలిచిపోవడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిర్మించిన బేస్‌బీమ్ తదితర నిర్మాణాలు కూడా వృథాగా మారే పరిస్థితి ఏర్పడకముందే మిగిలిన పనులను పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. పాత భవనం పరిస్థితిని పరిశీలించి ప్రజలు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మంచాల సభలో ప్రొటోకాల్ ఉల్లంఘన

## కలెక్టర్ సీ నారాయణ రెడ్డికి సర్పంచుల ఫిర్యాదు

- మహిళా సర్పంచులక స్థానంలో భర్తలు హాజరు
- మండల సభలో ఆసీనులైనా కాంగ్రెస్ నాయకులు
- ఇదేమిటని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే అవమానించారు
- కనీసం ఎంపీడీవో కూడా స్పందించలేదు



**రంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :**
మంచాల మండల సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్‌ను పూర్తిగా తుంగలో తొక్కి తమను అవమానించారంటూ బీఆర్ఎస్, సీపీఎం సర్పంచులు జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డికి కు ఫిర్యాదు చేశారు. కొంగరకలాన్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి ఈ మేరకు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. ఈ నెల 3న ఎంపీడీఓ వసంతలక్ష్మి అధ్యక్షతన, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ నిబంధనలు గాలికి ఎగిరిపోయాయని ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర మండలాల నాయకులు, మహిళా సర్పంచుల భర్తలు ముందు వరుస సీట్లను ఆక్రమించడంతో ఎన్నికైన తమకు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా పోయాయని వాపోయారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం

లోపలి పేజిలో




# రూ.లక్ష లంచం తీసుకుంటూ డీఎంహెచ్ఓ ప్రైవేట్ డ్రైవర్ అరెస్ట్

**రాజేంద్రనగర్,అక్టోబర్5(జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యను ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఫిజియోథెరపీ కేంద్రానికి సంబంధించిన తాళాలు తిరిగి ఇవ్వడం, తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం, కొత్త లైసెన్స్ జారీ చేయడం కోసం రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.ఇందులో భాగంగా రూ.లక్ష లంచం తీసుకుంటుండగా కృష్ణయ్యను పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్‌ల పాత్రపై కూడా కేసు నమోదు చేసిన ఏసీబీ, ముగ్గురినీ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. కేసు దర్యాప్తులో కొనసాగుతుందని ఎసిబి అధికారులు తెలిపారు.ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు లంచం ఇవ్వకుండా వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# తండ్రి బతికుండగానే చంపేసి

## డెత్ సర్టిఫికెట్ సృష్టించిన ప్రబుద్ధులు

- ప్రభుత్వ ఉద్యోగం కొట్టేసిన వైనం
- అవినీతికి కేరాఫ్‌గా మారిన మాజీ వీఆర్వో లీలలు
- సమగ్ర విచారణ జరిపించి.. తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితుడి వినతి



**రంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** తండ్రి జీవించి ఉండగానే ఆయన మరణించినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) సృష్టించి, ఆ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందిన వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం మల్లికార్జున కాలనీకి చెందిన ఆకాష్ నాయక్ జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన వివరాలు.. కొత్తూరు మండలం కేషన్‌పేట్ గ్రామానికి చెందిన అనంతయ్య (తండ్రి బాలయ్య) మొదట విఆర్ఏ గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత ప్రమోషన్‌పై వీఆర్వోగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019వ సంవత్సరంలో నాలుగు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన అనంతయ్య, కేషన్‌పేట్‌లో పని చేసిన కాలంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి అమాయక రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. కేషన్‌పేట్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పి. అనసూయమ్మకు తెలియకుండా ఆమె కుమారులు పి. రఘునాథ్ రెడ్డి, పి. సత్యనారాయణ రెడ్డిలతో కుమ్మక్కై, తప్పుడు అఫిడవిట్లతో సుమారు 27 ఎకరాల భూమిని అన్యాయంగా ఇతరుల పేరిట విరాసత్ చేశారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదే సమయంలో భూమి విషయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని తెలిపారు. ఏ సంవత్సరంలో ఉద్యోగంలో చేరారనే వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరినా సరైన సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు.

**తండ్రి బతికి ఉండగానే చంపేసిన ఘనుడు..**
తండ్రి జీవించి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి తండ్రి ఉద్యోగాన్ని అనంతయ్య కొట్టేసినట్లు అనుమానం ఉందని బాధితుడు పేర్కొన్నారు. ప్రస్తుతం శంకర్‌పల్లి మండలంలో జూనియర్ అసిస్టెంట్ (జీపీఓ) గా పని చేస్తున్న ఆయనను ప్రశ్నిస్తే.. ఇల్లు కూలిపోయిందని, సరైన పత్రాలు లేవని, తనకు గుర్తు లేదని పొంతన లేని సమాధానాలు చెబుతూ తప్పించుకుంటున్నారని తెలిపారు. ఈ ఉదంతంపై అత్యున్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, ఉద్యోగం పొందిన తీరుపై నిజానిజాలు తేల్చి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ వినతి పత్రం ప్రతిని గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపించినట్లు ఆకాష్ నాయక్ వెల్లడించారు

# మా పొట్ట కొట్టొద్దు.. డబ్బా కూల్చొద్దు

- **అధికారుల ఎదుట బండి నవీన్ కుటుంబం కన్నీటి వేడుకోలు**
- **కంటతడి పెట్టిన తల్లి.. బాధితులకు స్థానికుల మద్దతు**




**జవహర్‌నగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** జవహర్‌నగర్‌లో డబ్బా కూల్చివేత అంశం ఉద్రిక్తతకు దారితీసింది. కష్టపడి సంపాదించిన డబ్బులతో స్థలం కొనుగోలు చేసి, అందులో డబ్బా ఏర్పాటు చేసుకున్నామని, దానిని కూల్చివేయవద్దంటూ బండి నవీన్, ఆయన తల్లి అధికారులను వేడుకున్నారు. తమకు అన్యాయం జరుగుతోందంటూ వారు కంటతడి పెట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కష్టపడి స్థలం కొనుగోలు చేశాం. బండి నవీన్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఎంతో కష్టపడి సంపాది ంచిన డబ్బులను కూడబెట్టి సదరు స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. ఎలాంటి ఆక్రమణకు పాల్పడలేదని, తమకు సంబంధించి న స్థలంలోనే డబ్బా ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని వారు ఆరోపించారు.

అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణ. రాజకీయ, అధికార పలుకుబడిని ఉపయోగించి తమ డబ్బాను కూల్చివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధిత కుటుంబం ఆరోపించింది. తమ వాదనను పూర్తిగా పరిశీలించకుండా కూల్చివేతకు చర్యలు చేపట్టవద్దని అధికారులను కోరింది.

**"మా పొట్ట కొట్టొద్దు" అంటూ వేడుకోలు**

కూల్చివేత చర్యల నేపథ్యంలో బండి నవీన్, ఆయన తల్లి అధికారులను వేడుకుంటూ కంటతడి పెట్టారు. "మేం ఎలాంటి కబ్జా చేయలేదు. రూపాయి రూపాయి కూడబెట్టి ఈ స్థలాన్ని కొనుక్కున్నాం. మా కుటుంబానికి ఇదే ఆధారం. మా పొట్ట కొట్టవద్దు.. డబ్బాను కూల్చివేయవద్దు" అంటూ వేడుకున్నారు.

బాధిత కుటుంబానికి మద్దతుగా స్థానికులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం పై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించిన తరువాత నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరారు. తమకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బండి నవీన్ కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే.. రెవెన్యూ యంత్రాంగం ఏం చేస్తోంది?

**ఫిర్యాదులపై కదలని అధికారులు.. ఆర్డీఓ జోక్యంతోనే హడావుడి**

- **సర్వే నంబర్ 103లో అక్రమ నిర్మాణాలపై తీవ్ర ఆరోపణలు.. అధికారుల తీరుపై విమర్శలు**





**బోడుప్పల్-జనంసాక్షి :** ప్రభుత్వ భూములను కాపాడాల్సి న రెవెన్యూ యంత్రాంగం పనితీరుపై మేడిపల్లి మండలం లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో అక్రమ కబ్జాలు, నిర్మాణాలు జరుగుతున్నాయ ని పలుమార్లు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ మండ ల స్థాయి అధికారులు సకాలంలో స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వస్తున్నా కదలరా.. ఉన్నతాధికారి ఆదేశిస్తేనే స్పందిస్తారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మేడిపల్లి పరిధిలోని సర్వే నంబర్ 103లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు రెవెన్యూ శాఖ పనితీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. స్థానిక సామాజిక కార్యకర్త మూడి మార్టిన్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమిలో కబ్జాలు, నిర్మాణాలపై మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సకాలంలో చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

ఫిర్యాదులు అందిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న విషయం అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ఇదే అంశంపై కీసర రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)కు ఫిర్యాదు చేయడంతో పరిస్థితిలో మార్పు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. ఆర్డీఓ జోక్యంతోనే మండల స్థాయి అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

**ఉన్నతాధికారి ఆదేశిస్తేనే స్పందించే పరిస్థితి ఎందుకు?**

ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత కలిగిన అధికారులు ముందస్తు నిఘా ఎందుకు పెట్టడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి కబ్జాలను అడ్డుకోవాల్సిన అధికారులు.. నిర్మాణాలు జరిగే వరకు వేచి చూసి, ఆ తర్వాత చర్యలు చేపడితే ప్రభుత్వ ఆస్తులకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటి పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేదని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. సర్వే నంబర్ 103లో జరిగిన ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి.. ఫిర్యాదులు అందినప్పటి నుంచి అధికారులు తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు ఆరా తీయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కబ్జాలు తొలగించడం కాకుండా.. అవి ఎలా జరిగాయి? అధికారుల దృష్టికి వచ్చినా ఎందుకు సకాలంలో అడ్డుకోలేకపోయారు? అనే అంశాలపై కూడా బాధ్యతను నిర్ధారించాలని కోరుతున్నారు.

# మంచాల సభలో ప్రోటోకాల్ ఉల్లంఘన

చేస్తే ఎమ్మెల్యే జోక్యం చేసుకుని, సర్పంచులను బయటకు వెళ్లాలంటూ కించపరిచే విధంగా అవమానపరిచారని, బాధ్యత గల ఎంపీడీఓ కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, గ్రామ సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు సిఫార్సు చేసిన అసలైన లబ్ధిదారుల జాబితాను పక్కనబెట్టి అధికారుల వద్దకు చేరేసరికి లిస్టును తారుమారు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారిక సమావేశంలో ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి అనధికార వ్యక్తులకు ప్రాధాన్యమిచ్చిన ఎమ్మెల్యే, ఎంపీడీఓతో పాటు సంబంధిత నేతలపై సమగ్ర విచార ణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, ఆధారాలను ఫిర్యాదుకు జతచేశామని తెలిపారు. కలెక్టర్కు ఫిర్యాదు చేసిన వారిలో జాపాల, చెన్నారెడ్డిగూడ, రంగాపురం, తాళ్లపల్లి గూడ ,బండలేమూర్, నోముల, ఎల్లమ్మ తండ, బోడ కొండ, ఆరుట్ల, లోయపల్లి, బోడకొండ, ఆగపల్లి, తాళ్లపల్లి గూడ సర్పంచులు మంచాల రవీ ందర్, జయ, నేనావత్ బాలకృష్ణ,టిల్లు,రఘురాం,శంకరయ్య, శృతి, ఉమా, శోభా ఉన్నారు.

# మైనర్ నర్సుపై ఆర్ఎంపీ డాక్టర్ అఘాయిత్యం

**ఫోక్సో చట్టం కింద కేసు నమోదు.. నిందితుడి రిమాండ్.**



**మల్కాజిగిరి అక్టోబర్ 5 (జనంసాక్షి) :** ట్రైనీ నర్సుగా పనిచేస్తున్న ఓ మైనర్ బాలికపై ఆసుపత్రి యజమాని ఆర్ఎంపీ డాక్టర్ పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడి అత్యాచారం చేసిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మెదక్ జిల్లా గణపురం మండలం మెట్టు తడ వాడి కి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ పర్యా నాయక్ నే రేడ్‌మెట్ సంతోషిమా నగర్ కాలనీలో శ్రీ సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నడుపుతున్నారు. అందులో ఓ మైనర్ బాలిక ట్రైనీ నర్సుగా విధులు నిర్వహిస్తోంది. ఆసుపత్రి యజమాని ఆర్ఎంపీ డాక్టర్ తార్యా నాయక్ సదరు బాలికపై కన్నేసి మాయ మాటలు చెప్పి, పలుమార్లు లైంగికంగా వేధించడంతో పాటు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు విషయాన్ని తల్లికి చెప్పడంతో బాధితురాలి తల్లి నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు తార్యా నాయక్‌పై ఫోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారణ అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

# అర్హులైన వారి ఓట్లు తొలగించడం అత్యంత దారుణం

**ఓట్ల తొలగింపుపై చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు**

**ముషీరాబాద్ సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అక్రమంగా తొలగించడం అత్యంత దారుణమని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ మండిపడ్డారు. అర్హులైన ఓటర్ల పేర్లను ఎలాంటి కారణం లేకుండా ఓటరు జాబితా నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. బూత్ నంబర్ 210లో 31 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడంపై బీజేపీ బీఎల్ఏ భానుచందర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఠా జై సింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఓట్లు తొలగించిన వారిపై కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జై సింహ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని యువత, మహిళలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపడుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో కోట్లాది ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌కు ముందు సుమారు 3.10 లక్షల ఓట్లు ఉండగా, ప్రక్రియ అనంతరం సుమారు 1.75 లక్షల ఓట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. వివిధ కారణాలు చూపుతూదాదాపు 1.35 లక్షల ఓట్లు తొలగించబడినట్లు ఆయన ఆరోపించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని జై సింహ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు ఏం రాకేష్ కుమార్, శంకర్ ముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, వై శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, శివ ముదిరాజ్, బల్ల ప్రశాంత్, బిఆర్ఎస్ శ్రేణులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ పి.పాండుకి ఏఎస్ఐగా ప్రమోషన్

**బంట్వారం అక్టోబర్ 05 జనం సాక్షి :** బంట్వరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.పాండు కి,ఏఎస్ ఐ,గా ప్రమోషన్ వంచ్చినందున వారికీ శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పి.యాదగిరి,ఎస్,నర్సిములు,సాల్బత్త పూర్ సర్పంచ్ బాలయ్య,బంట్వరం మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు జి.నర్సిమారెడ్డి బంట్వరం మండల ంఓ సెల్ అధ్యక్షులు అంజయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీ.రమేష్.ఎన్. నర్సిములు. బస్వాపూర్ రత్నయ్య, బస్వాపూర్ కాంగ్రేస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఏలియా,యం.వెంకట్. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనారు.

# అంజయ్య నగర్ పార్కు కబ్జాదారులపై చర్యలు తీసుకోండి : కసిరెడ్డి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం అంజయ్య నగర్ సర్వే నంబర్ 134, 136 పరిధిలోని ఎకరా 20 గుంటల పార్కు స్థలాన్ని పలువురు కబ్జా చేసి ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే గురుతర బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ కళ్ళు మూసుకొని కొంగ జపం చేస్తుండడం సిగ్గుచేటని, ఇప్పటికైనా అధికారులు బేషరతుగా స్పందించి తక్షణమే కబ్జాస్థలాన్ని స్వాదీనపరచు కొని తిరిగి పార్కు స్థలంగా అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని జనంకోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని సిఎంసి కమిషనర్ కు సదరు విషయంపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ జనంకోసం స్వచ్ఛంద సంస్థ ప్రజాహిత కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ



స్థలాల పరిరక్షణకుసైతం సుదీర్ఘకాలంగా నడుం బిగించిందని, ఇందులో భాగంగానే ఇప్పటికే ఎన్నో ప్రభుత్వ స్థలాలను కబ్జా కోరలనుండి పరిరక్షించి ప్రభుత్వ స్వాధీన పరచడం జరిగిందని, ఈ క్రమంలో అంజయ్య నగర్ లోని పార్కు స్థలం కబ్జాపై సైతం 2024 నుండి అవిశ్రాంత పోరాటం చేయడం జరుగు తుందని, ఇందులో భాగంగా అప్పటి జిహెచ్ఎంసి సర్కిల్ కమిషనర్ కు పలు దఫాలు సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ 2025 నవంబర్ 25 న పార్కు స్థలంపై క్షేత్రస్థాయి తనిఖీలను నిర్వహించి తగిన చర్యలు తీసుకోమంటూ నామమాత్రపు లేఖను రాసి వదిలేయడంతో కజ్జాల పర్వం యదేచ్చగా కొనసాగుతుందని, స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం మున్సిపల్ అధికారులే కబ్జాలను పరోక్షంగా ప్రేరేపిస్తున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నప్పటి కీ... పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిఎంసి అధికారు లు వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే అది ముమ్మాటికి నిజమేననిపిస్తుందని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం సిఎంసి ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై అంజయ్య నగర్ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సిఎంసి అధికారులు హైడ్రా అధికారులతో సమన్వయం చేసుకొని తక్షణమే కబ్జాలను నేలకుల్చి పార్కు స్థలాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు.

# సిఎంసి 8వ స్టాండింగ్ కమిటీ సమావేశం

- హాజరైన ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్
- పలు కీలక అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) 8వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జై సి రంజన్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన, ముగ్గురు జోనల్ కమిషనర్లు మరియు వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అబి వృద్ధి పనులకు ప్రతిపాదనలను ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించ డం జరిగింది. ఇందులో భాగంగా కూకట్పల్లి జోన్ పరిధిలోని ట్రెండ్స్ జూనియర్ కళాశాల నుండి వైష్ణవి ప్రైడ్ అపార్ట్మెంట్ వరకు ఇప్పటికే నిర్మితమైన బాక్స్ డ్రెయిన్ మిగిలిన పనులను 5.95 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నిర్వహించేందుకు ప్రతిపాదనలను ఆమోదించడం జరిగింది. దుర్గం చెరువు పరిధిలో దాదాపు 140 ఎకరాలలో సమగ్ర లేక్ ఫ్రంట్ అభివృద్ధి, ప్రత్యేక ప్రయోజన సంస్థ ఏర్పాటు ప్రతిపాదనను ఆమోదించారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయం ప్రధాన భవనం నిర్మాణానికి 5.18 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదించారు. హిందూ, ముస్లిం స్మశాన వాటికలనుండి ఆల్విన్ కాలనీ సర్కిల్ సరిహద్దు వరకు మోడల్ రోడ్డు అభివృద్ధికై 2.95 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను రూపొందించినట్లు అధికారులు తెలియజేశారు. మున్సిపల్ సమస్యలకు వెన్న పరిష్కారాలు, ఫోటో టైపింగ్ మరియు సాంకేతిక ఆధారిత పరిష్కారాల అభివృద్ధి నిమిత్తం టీ వర్క్స్ ఫౌండేషన్ తో ఏర్పాటు చేసుకున్న అవగాహన ఒప్పందానికి సంబంధించిన చర్యలను ఆమోదించడం జరిగింది. చింతలకుంట చెరువు పునరుజీవనం, అభివృద్ధిలో భాగంగా పూడికతీత, కట్టల రక్షణ, ఇది నాణ్యత పునరుద్ధరణతోపాటు నార్లకుంట చెరువుకు సంబంధించి బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులకు 21.59 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ఆమోదించడం జరిగింది. పట్టణ మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం, ఇంధన నిర్వహణ, సేవలువంటి పలు కీలక ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జీడిమెట్ల సి అండ్ డి ప్రాసెసింగ్ సదుపాయం, మున్సిపల్ స్థాయిలో బయోడైవర్సిటీ మేనేజ్మెంట్ కమిటీల పునర్వ్యవస్థీకరణకు సంబంధిం చిన అంశాలు కూడా ఈ ప్రతిపాదనలలో చోటుచేసుకున్నట్లు సిఎంసి అధికారులు తెలియజేశారు. మున్సిపల్ మౌలిక వసతుల బలోపేతం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం, కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులను సమన్వయంతో చేపట్టే దిశగా ఈ సమావేశంలో ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయాలు తీసుకున్నామని సిఎంసి ఉన్నతాధికారులు తెలియజేశారు.



## తాండూరు ఆర్టీసీ డిపోలో టిడబ్ల్యూకు బ్రహ్మరథం

**ఇతర యూనియన్ల నుండి భారీగా చేరికలు**

**తాండూరు ఆక్టోబర్ 5(జనంసాక్షి) :** ఆర్టీసీ డిపోలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్య) హవా కొనసా గుతోంది. నిన్న గ్యారేజ్ ఖాళీ... నేడు మహిళా సోదరీమణుల చేరికతో టిడబ్ల్యూకు బ్రహ్మరథం పడుతున్నారని కార్మి కులు అంటున్నారు. టిజిఎస్ ఆర్టిసి యూనియన్ ఎన్నికల్లో భాగంగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్ల నుండి ప్రభుత్వ అనుబంధ సంస్థగా ఉన్న తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టి డబ్ల్యూ) లోకి భారీ సంఖ్యలో కార్మికులు చేరడం జరిగింది. ఈ సందర్భంగా టిడబ్ల్యూ నాయకులు మాట్లాడుతూ... "కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా టిడబ్ల్యూ పని చేస్తోంది. ప్రభుత్వ అనుబంధ యూనియన్ కావడంతోనే కార్మికులు మాపై నమ్మకంతో భారీగా చేరుతున్నారు. రాబోయే యూనియన్ ఎన్నికల్లో టి డబ్ల్యూ ఘన విజయం సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ గౌరవ అధ్యక్షులు సోమశేఖర్, నాయకులు నవీన్, అంజిలయ్య, బాలప్ప, బస్వరాజ్, శ్రీనివాస్, మహిళా నాయకురాళ్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాటల్లో కాదు... చేతల్లో సంక్షేమం

- ఇబ్రహీంపట్నంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- పోల్కంపల్లి లో 50 లక్షల విలువ చేసే సిసి రోడ్డు ప్రారంభం



**రంగారెడ్డి, అక్టోబర్ 5 జనంసాక్షి :** ప్రజలకు సంక్షేమాన్ని కలిగిస్తామ ని కేవలం మాటలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేతుల్లో చూపిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని శాస్త్రా గార్డెన్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కానీ నేటి ప్రజాపాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలు అందేలా స్మార్ట్ విధానాన్ని తీసుకొచ్చామని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకం గా అందుతాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని, నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొ న్నారు. అంతకుముందు పోల్కంపల్లి లో 50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి బాటలు వేస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు దశలవారీగా చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలు చెప్పిన సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, క్షణం కూడా ఆలస్యం చేయకుండా అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం లేదని, ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల మధ్యకు వచ్చినప్పుడే సమస్యలను తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి సర్పంచి కొండల్ గౌడ్, ఉప సర్పంచ్ వెంకటేష్, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ప్రమీల నాయక్, తహసిల్దారు సునీత రెడ్డి, పలువురు కౌన్సిలర్లు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## డుమ్మా కొట్టకుండా 100% హాజరుతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

**అభినందించి,ప్రశంసా పత్రాలు అందజేసిన ఎంఈవో హరిలాల్**




**బొంరాస్ పేట, అక్టోబర్ 5 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు విశాల్, సహస్ర ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభం నుండి ఆగస్టు 3 వరకు 57 రోజులపాటు ఒక్కరోజు కూడా గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చారు. దీంతో మండల విద్యాధికారి హరిలాల్ సోమవారం ఇద్దరు విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై,మీమీ కుటుంబాలలో ఎన్నో సమస్యలు ఉన్న,రవాణా సౌకర్యము లేకపోయిన, క్రమశిక్షణతో పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు నేర్చుకొని మంచి జీవితాన్ని కొనసాగించే విధంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,పాఠశాలకు నిరంతరం గుర్తింపు తీసుకురావాలన్నారు. సోమవారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కావడంతో ఉపాధ్యా యులకు ఎంఈఓ హరిలాల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య, అనిల్ కుమార్,హరి కాంత్,మాధవరెడ్డి,గుంజ వెంకటయ్య, లక్ష్మీకాంతరావు, నర్సింలు, కాశయ్య, రమేష్, బాకారం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నిత్య జీవితంలో వ్యాయామం తప్పనిసరి

**బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**



**సికింద్రాబాద్, (జనం సాక్షి):** ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పేర్కొన్నారు. ఈ మేరకు పులిమామిడి కృష్ణమాచారి కుమారుడు అభిషేక్ ఏర్పాటు చేసిన అభిషేక్ ఫిట్స్ జిమ్ స్టూడియో ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ ఉద్యోగం కోసం కాకుండా సంస్థలను ఏర్పాటు చేసి ఇతరులకు ఉపాధి కల్పించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి యాంత్రిక జీవనంలో పడి ఆరోగ్యం పై శ్రద్ధ చూపకపోవడం వల్ల యువత అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని ఆరోగ్యంగా జీవించాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని సూచించారు. ఇప్పటికే అభిషేక్ 4 జిమ్ములను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఇతరులకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి అవినాష్, అశోక్ గౌడ్, వల్లబోజు నరసింహాచారి, అనంతోజు బ్రహ్మచారి తదితరులు హాజరై అభిషేక్ కంగ్రాట్స్ తెలిపారు.

## పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కొండంత అండ



- 57 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ
- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తిరుపతిరెడ్డి

**బొంరాస్ పేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కొండంత అండగా నిలుస్తుందని కొడంగల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 57 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,విబిజిరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి,మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి,వెంకట్ రాములు గౌడ్, మల్లేశం,దేశ్యా నాయక్, నరసింహనాయుడు, మల్లికార్జున్, సర్పంచులుపాల్గొన్నారు.



**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి**

దుద్యాల : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం దుద్యాల మండలం చెట్టుపల్లి తండాలో నూతన గ్రామపంచాయతీ భవనం, కుదురుమళ్ళ, హస్నాబాద్లో గ్రామ మహిళా సమైఖ్య భవనాలను ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు అత్యధికంగా నిధులు కేటాయించి సీఎం రేవంత్ రెడ్డి మోడల్ నియోజకవర్గంగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుటి శేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు రవి నాయక్,ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్,ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**శంకర్‌పల్లి, అక్టోబర్ 4 (జనం సాక్షి):** మాజీ హోంమంత్రి, దివంగత నేత ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా "ఇంద్రారెడ్డి అమర్ రహే" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఇంద్రారెడ్డి ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మహానేత అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారుప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడిన ఇంద్రారెడ్డి సేవా స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగాతీసుకోవాలనిసూచించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి,నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఉషారాణి విజయ్ కుమార్, నాయకులు దోసాడ నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి,ఉపేందర్ రెడ్డి, శ్రీనాథ్ గౌడ్, నారాయణ,కొంగల మల్లేష్,వెంకట్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొండ మానేయ,గోవర్ధన్,పాండు,రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లేయర్ పౌల్ట్రీ ఫామ్‌పై చర్యలు తీసుకోవాలి



**కేశంపేట, అక్టోబర్ 5 (జనం సాక్షి ) :** కేశంపేట రెవెన్యూ శివారు సర్వే నెంబరు 792లో ఉన్న లేయర్ పౌల్ట్రీ ఫామ్ పై చర్యలు తీసుకోవాలని భోధునం పల్లి గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ ప్రజావాణిలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. పౌల్ట్రీ ఫామ్ నుండి వచ్చే దుర్వాసనతో భోధునం పల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫామ్ నిర్వాహకులను సమస్యపై అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో మల్లేష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

### బీఆర్ఎస్ కౌన్సిలర్ పటేల్ సుప్రీతా కరుణాకర్ పిలుపు




**తాండూరు అక్టోబర్ 5(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం జరగబోయే పట్టభద్రుల ఎన్నికలలో పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ వార్డ్ నెంబర్ 34 పటేల్ సుప్రీతా కరుణాకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పట్టభద్రులు ప్రతి ఒక్కరు తమ యొక్క ఓటు నమోదు చేసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మీ యొక్క అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులైన వారు తమ ఓటు నమోదు చేసుకుని, రాష్ట్ర భవిష్యత్తు కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

## శిల్పి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షుడిగా అల్వాల్ రెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా సురేష్ రెడ్డి

### కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం.. సమస్యల పరిష్కారానికి కృషి

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట పరిధిలోని శిల్పి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కాలనీ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం విశేషం. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. అధ్యక్షుడిగా బొమ్మిడిక అల్వాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక సురేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చౌదర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బండ శేఖర్ రెడ్డి, మేక మల్లారెడ్డి, ప్రధాన సలహాదారులుగా పశ్య వీరారెడ్డి, గుదిబండ గోవిందరెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా తాటికొండ లింగారెడ్డి, జి. మల్లేష్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా గోకుల వెంకటరెడ్డి, దేవరపల్లి నరసింహారెడ్డి, పాల్వాయి శేఖర్ రెడ్డి, కోశాధికారులుగా బి. నాగేశ్వరరావు, ఇరిగల నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. నిర్వహణ కార్యదర్శులుగా పోరెడ్డి మధుసూదన్ రెడ్డి, నాంపల్లి రామకృష్ణారెడ్డి, కారే శ్రీకాంత్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. శిల్పి కాలనీ సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని తెలిపారు. కాలనీలోని సమస్యలను సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు



కృషి చేస్తామని, కాలనీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలకు అధికారుల అండదండలా?

### ఫిర్యాదులు వస్తున్న పట్టించుకోరా?

### నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్నది ఎవరు?

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 (జనం సాక్షి ):** పెద్దఅంబర్‌పేట, కుంట్లూరు, పసుమాముల ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు, నిర్మాణ నిబంధనలు పట్టించుకోకుండా పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందుతున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు వేచి చూస్తున్నారా? లేక నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఫిర్యాదులు వస్తున్నా.. చర్యలు ఏవి?**

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్న చర్చ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తనిఖీలు, నోటీసులు, తదుపరి చర్యలు ఎంతవరకు జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఫిర్యాదులపై అధికారులు స్పందిస్తున్నారా? లేక నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నారా? అని స్థానికులు నిలదీస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు, పన్నులు, నిర్మాణ నిబంధనల విషయంలో అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు.

**అధికారుల కనుసైగల్లోనేనా?**

అధికారుల పర్యవేక్షణ లోపిస్తే నిబంధనలను ఉల్లంఘించే నిర్మాణదారులకు మరింత అవకాశం ఏర్పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరోలా చేపడుతున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు స్పందిస్తారా?**

కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట, పసుమాముల ప్రాంతాల్లో ప్రత్యేక క్షేత్రస్థాయి తనిఖీలు ఎప్పుడు నిర్వహిస్తారు? నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఫిర్యాదులపై అధికారులు ఇప్పటివరకు ఏం చేశారు? ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగితే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? లేక అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా ఇదే పరిస్థితి కొనసాగుతుందా? అన్నది వేచి చూడాలి.









## మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా కె. కార్తికేయన్



**తాండూరు ఆక్టోబర్ 5(జనంసాక్షి)** పట్టణ సమీపంలో ని యాలాల మహాత్మా జ్యోతిరావు పూలే (బాలుర) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ (ఎఫ్.ఎ.సి)గా కె. కార్తికేయన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని, గురుకుల పాఠశాల ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అందరి సహకారం అవసరమని, ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పాఠశాలను రాష్ట్రంలోనే ఆదర్శ గురుకులంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నూతన ప్రిన్సిపాల్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా దరఖాస్తులపై సత్వరమే స్పందించాలి

**ప్రజా వాణిలో 217 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా**




**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 05 (జనం సాక్షి)** : ప్రజల నుంచి అందే దరఖాస్తులపై సత్వరమే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, పీడీ అశోక్ చక్రవర్తితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా వాణిలో అందిన దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల వారీగా చేయూత పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను మండల తహసీల్దార్ల ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మండలాల వారీగా సమీక్షించి, వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 217 దరఖాస్తులు అందాయి. వీటిలో హౌసింగ్ 2బీహెచ్‌కేకు సంబంధించి 178, రెవెన్యూ శాఖకు 16, ఇతర శాఖలకు సంబంధించి 23 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సీపీఓ డాక్టర్ సురేందర్, డీఈఓ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారులు యు.ప్రవీణ్ కుమార్, జి.ఆశన్న, ఇలియాస్ అహ్మద్, సదానందం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాకా వెంకట్ స్వామి సేవలు చిరస్మరణీయం

**ట్యాంక్ బండ్‌పై కాకా విగ్రహానికి మంత్రుల నివాళులు**



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 05 (జనం సాక్షి)**

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకట్ స్వామి(కాకా) జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, అజారుద్దీన్ తదితర ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు వెంకట్ స్వామి అని కొనియాడారు. నీతి, న్యాయానికి కట్టుబడి ప్రజల సమస్యలపై స్పందించిన ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాయని అన్నారు. రాజకీయాల్లో ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, పేదలకు అండగా నిలవడంపై కాకా ఇచ్చిన మార్గదర్శకత్వం ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. తెలంగాణ సాధన ఆయన జీవితంలోని ముఖ్యమైన ఆకాంక్షల్లో ఒకటని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన నుంచి ఎన్నో సూచనలు, సలహాలు పొందామని తెలిపారు. కాకా ఆశయాలకు అనుగుణంగా ఆయన కుటుంబ సభ్యులు కూడా ప్రజా సేవలో కొనసాగడం సంతోషకరమన్నారు. ఆయన కుమారుడు మంత్రిగా, మరో కుమారుడు శాసనసభ్యుడిగా, మనవడు ఎంపీగా ప్రజలకు సేవ చేయడం ఆయన ఆశయాలు కొనసాగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు. ఈ కాకా వెంకట్ స్వామి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదలు, అణగారిన వర్గాలకు అండగా నిలవడమే ఆయనకు నిజమైన నివాళి అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# దేవనూర్‌లో దోమల నివారణకు ముందస్తు చర్యలు

**మురుగు కాల్వల్లో బ్లీచింగ్, పిచికారీ**

**సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు**



**యాలాల అక్టోబర్ 5(జనంసాక్షి)** తాండూరు నియోజకవర్గంలో యాలాల మండలం దేవనూర్ గ్రామంలో సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు.సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే దోమల నివారణ కోసం మందు పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమల బెడద పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల మందు పిచికారీ చేయడం జరుగుతోంది. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

# మొండి గౌరెల్లిలో భూ సర్వేలో తప్పులు

**రీ సర్వే చేయాలని ఆర్డీవో కి వినతి**

**19, 68, 127 సర్వే నంబర్లలో అవకతవకలు - నిజమైన రైతులు నష్టపోతారని ఆందోళన**



**యాచారం, అక్టోబర్ 5(జనం సాక్షి)** యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామంలో ప్రభుత్వం సేకరించనున్న 19, 68, 127 సర్వే నంబర్లకు సంబంధించి సర్వే వివరాల్లో తప్పులు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల 19, 68 సర్వే నంబర్లకు సంబంధించిన సర్వే వివరాలను గ్రామ పంచాయతీ వద్ద ప్రదర్శించగా, వాటిలో చాలా వరకు తప్పులు ఉన్నాయని రైతులు గుర్తించారు. ఇలాగే కొనసాగితే నిజమైన రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో 19, 68 సర్వే నంబర్లకు వెంటనే రీ సర్వే చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కొలను రామాదేవి మల్లారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఇబ్రహీంపట్నం ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



# గోశాలలో సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వాలి

**తాండూరు అక్టోబర్ 5(జనంసాక్షి)** గోమాతను దైవంగా భావించే గోబంధువులంతా ఒకే వేదికపైకి వచ్చిన వేళ... తాండూరు పట్టణం గోమయమయమైంది. ఆదివారం తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోబంధువుల ఆత్మీయ సమావేశం భక్తిభావంతో, సేవా సంకల్పంతో సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ బి ఓ ఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి గోశాల ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2010 లో ఒక చిన్న సంకల్పంతో ప్రారంభమైన తాండూరు గోశాల, నేడు ఒక మహా వృక్షమైంది. 2016 లో ఇక్కడి నుండే ఒక గోమాతను మా ఆర్ బి ఓ ఎల్ కు తీసుకెళ్లడం జరిగింది. నేడు ఆర్ బి ఓ ఎల్ కూడా ఒక మినీ గోశాలగా మారడం మాకు ఎంతో సంతోషాన్నిస్తోందని అన్నారు.గోశాల అంటే కేవలం షెడ్డు కాదు, అది ఒక సంస్కారం. సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికి ఇక్కడ అవకాశం ఇవ్వాలి. గోమాతను కాపాడుకుంటే, గోమాత మనల్ని కాపాడుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గోశాల నిర్వాహకులు, దాతలు, గోప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోశాల అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# అర్ధరాత్రి ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో ప్రత్యక్షమైన చైర్ పర్సన్

**వైద్యులకు క్లాస్ – రోగులకు భరోసా**

**మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి**



**తాండూరు అక్టోబర్ 5(జనంసాక్షి)** : తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి మధ్యరాత్రి ఆకస్మికంగా ఎం.సి.హెచ్ ఆసుపత్రిని సందర్శించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించాను. వైద్య సిబ్బంది విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం, మెరుగైన సౌకర్యాలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.

# పత్తి చేనులో మహిళా రైతులతో ఆత్మీయ ముచ్చట

**కంజర్ల విజయలక్ష్మి మానవతా స్పర్శ**



**తాండూరు అక్టోబర్ 5(జనంసాక్షి)** : పత్తి చేనులో మహిళా రైతులతో కలిసి కూర్చొని వారి కష్టాలు, సమస్యలు, ఆశయాలను తెలుసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు కంజర్ల విజయలక్ష్మి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నం పెట్టే రైతు, అందులోనూ మహిళా రైతుల కష్టం వెలకట్టలేనిది. ఎండా వానలను లెక్కచేయకుండా పొలంలో శ్రమిస్తున్న మీరు నిజమైన శ్రమజీవులు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను" అని భరోసా ఇచ్చారు.పత్తి రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర, కూలీల కొరత, వాతావరణ మార్పుల వంటి సమస్యలను మహిళా రైతులు విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. వారితో కలిసి పత్తి చేనులో కూర్చొని వారి అనుభవాలను స్వయంగా వినడం అందరినీ ఆకట్టుకుంది. విజయక్క ఆత్మీయ పలకరింపుతో మహిళా రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



## విష్ణుపురి ఎన్‌క్లేవ్‌లో పాండుగౌడ్ విజయం

**రాజశేఖర్‌రెడ్డిపై 22 ఓట్ల మెజార్టీతో గెలుపు**

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్**

**బోడుప్పల్-జనంసాక్షి :** విష్ణుపురి ఎన్‌క్లేవ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో పాండుగౌడ్ విజయం సాధించారు. ప్రత్యర్థి రాజశేఖర్‌రెడ్డిపై 22 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో పాండుగౌడ్‌కు కాలనీవాసులు అభినందనలు తెలిపారు. ఎన్నికల కార్యక్రమానికి మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి హాజరై పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్‌గౌడ్, మాజీ అధ్యక్షులు ఉమామహేశ్వర్‌రెడ్డి, నరసింహ, కిరణ్, రాజేందర్, రామ్మోహన్‌తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు.

## కంఠ మహేశ్వర స్వామి ఆలయ స్లాబ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**అనాజ్‌పూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం**

**సొంత ఖర్చులతో పనులు ప్రారంభించిన చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 (జనం సాక్షి ):** అనాజ్‌పూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠ మహేశ్వర స్వామి (కాటమయ్య) ఆలయ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ స్లాబ్ నిర్మాణ పనులను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తన సొంత ఖర్చులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరించడం పట్ల గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనాజ్‌పూర్ గ్రామ పెద్దలు, గౌడ సంఘం కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి 8 దరఖాస్తులు



శంకర్‌పల్లి,అక్టోబర్ 5 (జనం సాక్షి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 8 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్ తెలిపారు ఆరు దరఖాస్తులు రెవెన్యూ శాఖకు,ఒకటి ఆర్అండ్‌బీ శాఖకు, మరో దరఖాస్తు మున్సిపాలిటీకి సంబంధించినవిగా ఉన్నాయని,అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు 19 శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మురుగు నీటితో ప్రజల అవస్థలు

## కలుషిత నీరు, అపరిశుభ్రతపై తలసాని ఆగ్రహం

**సనత్ నగర్ /అమీర్పేట్ :** మురుగు నీరు తాగుతూ, అపరిశుభ్ర వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం దారుణమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్‌లోని నల్లగుట్ట, ఎఫ్‌లైన్, జే లైన్ ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. నల్లగుట్ట అభివృద్ధి సంఘం హాల్ వద్ద నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్యాంక్, బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం బస్తీలో పర్యటించిన ఆయన రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండటంపై అధికారులను ప్రశ్నించారు. మూడు నెలలుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నా ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సుమారు వెయ్యి కుటుంబాలు నివసించే నల్లగుట్టలో కలుషిత నీరు, డ్రైనేజీ సమస్యలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కారానికి ప్రతిపాదనలు అందించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. నూతన పైప్‌లైన్లు, అవసరమైన మరమ్మతులు చేపట్టి సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఎఫ్‌లైన్ కమిటీ హాల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను చూసి పారిశుద్ధ్య అధికారులపై తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన సిబ్బంది లేరని అధికారులు చెప్పడంతో ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వెంటనే ప్రత్యేక సిబ్బందిని నియమించి చెత్తను తొలగించాలని ఆదేశించారు. బస్తీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు వారానికి ఒకసారి పర్యటించి పర్యవేక్షించాలని సూచించారు. కమిటీ హాల్‌లో అవసరమైన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తలసాని మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి పాలనను పక్కనపెట్టి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నప్పటికీ నగర సమస్యలపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్, ఎలక్ట్రికల్ ఏఈ దుర్గాప్రసాద్, ఏఈ శివరామకృష్ణ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, శ్రీహరి, కోటేశ్వర్ గౌడ్, ఆంజనేయులు, టీనా గౌడ్, జనార్దన్, అరుణ్ భట్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి



**మల్కాజిగిరి అక్టోబర్ 5 (జనం సాక్షి)** : గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని జలమండలి జీఎం సునీల్‌ను కోరినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ తెలిపారు. స్థానిక కాలనీవాసులతో కలిసి సోమవారం జరిగిన ప్రజావాణిలో జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము యాదవ్ మాట్లాడుతూ. కాలనీలోని అంతర్గత రోడ్డులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సుమారు 150 మీటర్ల మేర నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ నవీన, కాలనీ పెద్దలు అచ్యుత్‌రావు, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకల్లో ప్రభు గైక్వాడ్‌కు ఘన సత్కారం



**శంకర్‌పల్లి,అక్టోబర్ 5 (జనం సాక్షి) :** స్వర్గీయ శ్రీ గడ్డం వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సత్కరించారు. ఇందులో భాగంగా వెటర్నరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు గైక్వాడ్ అందిస్తున్న సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి శాసనసభ్యులు వినోద్ చేతుల మీదుగా ప్రభు గైక్వాడ్‌కు మెమొంటో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభు గైక్వాడ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి సత్కరించడం ఎంతో ఆనందంగా,గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. సమాజానికి, ప్రజలకు మరింత అంకితభావంతో సేవలందించేందుకు ఈ సత్కారం తనకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. ప్రజలు, పశుపోషకులకు అవసరమైన సేవలను అందిస్తూ తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. స్వర్గీయ గడ్డం వెంకటస్వామి ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కాబోయే సీఎం బీసీ ప్రకటనపై హర్షం

**జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్**



**తాండూరు అక్టోబర్ 5(జనంసాక్షి)** శంషాబాద్ బహిరంగ సభలో తెలంగాణకు కాబోయే సీఎం బీసీ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చేసిన ప్రకటనను తాండూర్ నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ మహేష్‌కుమార్ గౌడ్ తన ప్రకటనకు కట్టుబడి కాంగ్రెస్ జాతీయ నాయకత్వాన్ని కూడా ఒప్పించాలని, కాంగ్రెస్‌లోని అన్ని వర్గాల నాయకులు బీసీ సీఎం అంశానికి మద్దతు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీలు కూడా బీసీ ముఖ్యమంత్రి అంశంపై తమ వైఖరిని వెంటనే బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలని కోరారు. అదేవిధంగా స్థానిక సంస్థలు, పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యత కల్పించాలని, బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం దక్కేలా చర్యలు తీసుకోవాలని మహేష్‌కుమార్ గౌడ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షకూర్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే సత్యనారాయణ, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా సంఘం ప్రతినిధులు మంజుల, నరసమ్మ, విజయలక్ష్మి, అనిత, మండలాల అధ్యక్షులు నరేందర్, లక్ష్మణ్ చారి, శ్రవణ్ కుమార్, నాయి బ్రాహ్మణ సమాజం నాయకులు పరమేష్, బీసీ సంఘం నాయకులు రాము ముదిరాజ్, మంతటి రాజు, బసవరాజ్, జోసెఫ్, భరత్ గౌడ్, కిరణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంసి పరిధిలో ప్రజావాణి కార్యక్రమంలో సిఎంసి కమిషనర్‌కు 44 ఫిర్యాదులు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సిఎంసి కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి సృజన ప్రత్యక్షంగా పాల్గొని అర్జీదారుల నుండి స్వయంగా 44 ఫిర్యాదులను స్వీకరించడం. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎంసి పరిధిలోని వివిధ ప్రాంతాలనుండి ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కాగా ఇందులో ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగం నుండి 31, ఇంజినీరింగ్ విభాగం నుండి 06, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం నుండి 02, రెవెన్యూ(ప్రాపర్టీ టాక్స్) నుండి 01, ఎస్టేట్స్ విభాగం నుండి 01, ఫుడ్ సేఫ్టీ విభాగం నుండి 01, శానిటేషన్ విభాగం నుండి ఒకటి ఫిర్యాదు అందినట్లు సిఎంసి కమిషనర్ వెల్లడించారు. స్వీకరించిన ప్రతి వినతికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి మరియు ట్రాకింగ్ లింక్ కేటాయించడం జరిగిందని అధికారులు తెలిపారు. తద్వారా ప్రజలు తమ ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారాన్ని పారదర్శకంగా పర్యవేక్షించే విధానం అమలు చేస్తున్నారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టి సకాలంలో పరిష్కరించాలని సిఎంసి కమిషనర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తుండడంతో పాటు ఫిర్యాదులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ మరియు తదుపరి చర్యలకు వేదికగా కొనసాగుతోందని కమిషనర్ మీడియాకు వివరించారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా వాటికి




అనువైన పరిష్కారాన్ని అందించాలని, పారదర్శకత ప్రథమ ప్రాధాన్య తగా అధికారులంతా పనిచేయాలని సిఎంసి కమిషనర్ స్పష్టం చేశారు. అయితే ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ నేత మిద్దెల మల్లారెడ్డి అయ్యప్ప సోసైటీ అక్రమాలపై రాతపూర్వక ఫిర్యాదును అందజేసినట్లు ఆయన మీడియాకు తెలియజేశారు.

**మియాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ...**

సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధికి సంబంధించి మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ విభాగాలకుగాను మొత్తం పది ఫిర్యాదులు అందినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగానికి 04, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 04, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సంబంధించి 02 ఫిర్యాదులు అందడం జరిగిందని, ప్రతి ఫిర్యాదుకు సంబంధించి గ్రీవెన్స్ ఐడి మరియు ట్రాకింగ్ లింకుతో అనుసంధానం చేసి సమస్యల సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను కల్పించనున్నట్లు ఈ సందర్భంగా మున్సిపల్ సర్కిల్ ఉన్నతాధికారులు వివరించారు.

## బంట్వారం మండలంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి : మాజీ జెడ్పిటిసి సంతోషరాజు

**బంట్వారం అక్టోబర్ 05 జనం సాక్షి :** హైదరాబాద్-మహబూబ్ నగర్ రంగా రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పట్ట బద్రులైన ప్రతి ఒక్క రూ వికారాబాద్ నియోజకవర్గం లోని బంట్వారం మండలం పట్టభద్రుల తప్ప నిసరిగా ఓటును నమోదు చేసుకోవాలని బంట్వారం మండల మాజీ జెడ్ పి టి సి సంతోష రాజు సోమవారము ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జనవరి 31, 2023 నాటికి



పట్టభద్రులై ఉన్నా వారు మాత్రమే అర్హులుగా ఎమ్మెల్సీకి ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫాం 18 లో వివరాలను పూర్తిగా నమోదు చేసి, డిగ్రీ సర్టిఫికెట్ పై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణలతో తహసీల్దార్ కార్యాలయంలో సమ ర్పించాలని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 ,2026 లోపు ఫాం 18ను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదై ఉన్నవారు తప్పని సరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యోగ స్తులు, కళాకారులు పోరాటాల ఫలితంగా, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఎందరో ఆత్మ బలిదానాల వల్ల తెలంగాణ ఏర్పడిందని, అందుకు స్వ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి అండగా నిలిచిందని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు ప్రక్రియలో భాగస్వామ్యమై ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓటర్ల జాబితాలో అక్రమాలపై అఖిలపక్షం పోరు

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా విజయవంతం చేయాలి**
- **రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాతం నరసింహారెడ్డి**



**శంషాబాద్,అక్టోబర్5(జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటర్ల జాబితా విషయంలో పారదర్శకతకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాతం నరసింహారెడ్డి ఆరోపించారు. సోమవారం శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏఐసీసీ, సిపిఐ సిపిఎం ఇండియా కూటమి పిలుపు మేరకు 'సేవ్ డెమోక్రసీ వీక్' కార్యక్రమంలో భాగంగా అఖిలపక్ష సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా జరగడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అఖిలపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ భీమ్ భరత్పీసీసీ మెంబర్ ఏనుగు జంగారెడ్డిసాని శ్రీనివాస్ గౌడ్, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, ఎం.ఏ. ఖలీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ, శివకుమార్, పుస్తకాల నర్సింగ్ రావు, ఒరుగంటి యాదయ్య, దూడల వెంకటేష్ గౌడ్, దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ హిల్స్, మాదాపూర్ అభివృద్ధి పనులను సమీక్షించిన సీఎంసి కమిషనర్ సృజన

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన సోమవారం కూకట్‌పల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, మాదాపూర్ డిప్యూటీ కమిషనర్‌తో కలిసి కాకతీయ హిల్స్, మాదా పూర్ ప్రాంతాల్లో ఉదయం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు రహదారి కనెక్టివిటీ, ప్రజా మౌలిక వసతుల మెరుగుదలకు అవసరమైన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కాకతీయ హిల్స్ కనెక్టివిటీకి సంబంధించి మసీదు భూమి నుంచి కాకతీయ హిల్స్ రోడ్ నెం.11కు, రోడ్ నెం.3 మరియు 7 వైపు అనుసంధానించే లింక్ రోడ్డును అభివృద్ధి చేయాల్సిందిగాఆమె అభిప్రాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ సిగ్నల్ నుంచి సున్నం చెరువు వరకు ఉన్న మార్గాన్ని గుర్తించి ఆక్రమణలను తొలగించడంతోపాటు వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించి మార్గాన్ని సక్రమంగా వినియోగంలోకి తీసుకురావాలని తెలియజేశా రు. సున్నం చెరువు కల్వర్ట్ నుంచి గోదావరి కట్స్, పార్వతీ నగర్



జంక్షన్ వరకు బీటీ రోడ్డు రీకార్పెటింగ్ పనులు చేపట్టాలని, ఫుట్‌పాత్ అభివృద్ధికి అవసరమైన రహదారి విస్తరణ చేపట్టిన అనంతరం హైటెక్ సిటీ ఫ్లైఓవర్ నుంచి ఆర్ఆర్ఆర్ బార్ వరకు ఫుట్‌పాత్ అభివృద్ధికి ప్రతిపాదన సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్ కు సూచించారు. వక్ఫ్ బోర్డు భూమిని ఆనుకుని ఉన్న రహదారి వెంబడి ప్రీకాస్ట్ గోడలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గుర్తించిన అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఇబ్రహీంపట్నంలో జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలకై 'పోస్టుకార్డు పోరు'

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5 (జనం సాక్షి ):** జర్నలిస్టులకు తక్షణమే హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, గౌరవ వేతనాలు అందించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద 'పోస్టుకార్డు ఉద్యమం' నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన



డిమాండ్లతో కూడిన పోస్టుకార్డులను రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపించారు. కార్యక్రమంలో తెజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు వరికుప్పల అశోక్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకుడు హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ, హెల్త్ కార్డులతో పాటు రెండో విడత అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ మొలుగు శ్రీనివాస్, తెజు జనరల్ సెక్రెటరీ ఆముదాల సందీప్, ఉపాధ్యక్షులు గుండె రాఘవేందర్, ముచ్చర్ల నాగేష్, హనుమంతు సుదర్శన్, ఆంజనేయులు, కోశాధికారి నరేందర్ రెడ్డి, నాయకులు సురమోని బాబు, ఆర్.కృష్ణ యాదవ్, చెరుకూరి మహేందర్, చెరుకూరి రాజు, ఎట్టి లక్ష్మయ్య, మహేందర్ గౌడ్, చెరుకూరి మల్లేష్, అల్లంపల్లి సురేష్, సురేష్ యాదవ్, మహేష్ చారి, గోపాల్, రామ్‌చందర్, శ్రీకాంత్ రెడ్డి, మేకల సురేష్, దుర్గేష్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పార్కులో అదనపు కమిషనర్ పర్యటన

**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 5( జనం సాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ 276వ డివిజన్‌లో ఉన్న ఎన్టీఆర్ పార్కును సోమవారం అదనపు కమిషనర్ సంబం ధిత అధికారులతో కలిసి సందర్శించారు. వాకర్స్ తో మాట్లాడి పార్కులోని అత్యవసర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో లైట్ల ఏర్పాటు చేయడం జరిగింది. పార్కులో మరుగుదొడ్ల సౌకర్యం, ఓపెన్ జిమ్ పరికరాలకు సంబంధించిన సమస్యలు, ఇతర అవసరాలను వారి దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామ ని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, దండగుల స్వామి, ఎల్లయ్య, ముత్యాలు , ఆల్విన్ ఉద్యోగులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్ అదనపు కమిషనర్ కు విజ్ఞప్తి చేస్తూ నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్ ప్రాంతాల్లో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలను ఏర్పాటు



చేయాలని కోరారు. ప్రధానంగా పిల్లలు, యువత, క్రీడాకారుల కోసం స్టేడి యం, క్రీడా మైదానం ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి కూరగాయలు, మాంసాహార విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్ స్థలం ఈ అవసరాల కోసం రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని, అనువైన స్థలాలను గుర్తించి, వీలైనంత త్వరగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రజా సౌకర్యాలను కల్పిస్తే నిజాంపేట్ సర్కిల్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రజల అవసరాలపై స్పందించి చర్యలు తీసుకునే అధికా రులకు ప్రజలందరూ కృతజ్ఞులుగా ఉంటార అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శంభీపూర్ క్రిష్ణ జన్మదిన సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజ



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 5 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఉదయం తిరుమలలోని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్కల జీతయ్య, భిక్షపతి, సుంకరి రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి



**మల్కాజిగిరి అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మౌలాలి డివిజన్ పరిధిలోని ఎంజే కాలనీలో ఈ నెల 18వ తేదీ ఆదివారం నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ స్థానిక మహిళలు మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గాగ్వార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కాలనీ మహిళలు, స్థానికులు కలిసి సాంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకునేందుకు సన్నాహాలు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ వేడుకల కోసం ప్రాంగణాన్ని శుభ్రపరచడం, పారిశుద్ధ్య పనులు, విద్యుత్ దీపాల వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. అలాగే మున్సిపల్ కార్యాలయం తరఫున ఒక బతుకమ్మను కూడా సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, ప్రశాంత వాతావరణంలో సంబరాలు నిర్వహిస్తామని నిర్వాహకులు కీర్తి, స్వాతి పేర్కొన్నారు.

## టిప్పర్‌ను ఢీకొట్టిన మరో టిప్పర్

### చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి



**బొంరాస్ పేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మండల పరిధిలోని సూర్య నాయక్ తండ మూలమలుపు దగ్గర సోమవారం తెల్లవారుజామున ముందు వెళ్తన్న టిప్పర్ ను వెనక వస్తున్న మరో టిప్పర్ ఢీ కొని ప్రమాదం జరిగిన సంఘటన చోటుచేసుకుంది.ఎస్సై బాల వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లకుంట గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ టి.శ్రీను టిజి 07 వి 7761 నడుపుకుంటూ వెళుతుండగా, అతని ముందు వెళ్తున్న టీజీ 07 వి 7757 టిప్పర్ నడుపుతున్న డ్రైవర్ అనిల్ ఇలాంటి ముందస్తు సూచనలు ఇవ్వకుండా ఆకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనకనుంచి వచ్చిన టిప్పర్ ముందున్న టిప్పర్ ను ఢీకొట్టడంతో టిప్పర్ డ్రైవర్ టి.శ్రీను కుడి కాలికి తీవ్ర గాయం కాగా 108 అంబులెన్స్ ద్వారా కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ అనిల్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపి అకస్మాత్తుగా బ్రేకులు వేయడమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో గుర్తించడం జరిగిందన్నారు. ఘటనపై ఫిర్యాదు మేరకు స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రక్తదానం అన్ని దానాల కంటే గొప్ప దానం

### డబ్బునీ వెంకట్ జన్మదిన వేడుకలు ఘనంగా

### జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**మోమిన్‌పేట, అక్టోబర్ 5 (జనం సాక్షి):** రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణాలు కాపాడవచ్చని ఇలాంటి మంచి కార్యక్రమానికి ముందుకు రావడం డి వెంకట్ కు అభినందించెదగా విషయమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు మోమిన్‌పేట మండల పరిధిలో మోమిన్‌పేట్ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డబ్బుల వెంకట్ జన్మదిన సందర్భంగా స్థానిక బికెఆర్ కళ్యాణమండమంలో రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎనకతల సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, టేకులపల్లి సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వికారాబాద్, ధారూర్, కోట్‌పల్లి, మర్పల్లి, బంటారం తదితర ప్రాంతాల నుంచి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి డబ్బునీ వెంకట్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డబ్బునీ వెంకట్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





## ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్

**కొడంగల్, అక్టోబర్05(జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గం చిల్ముల్ మైలారం గ్రామంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చింతకింది బాలయ్య ముఖ్య అతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించారు.ఈ సందర్భంగా సుమారు 100 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై నిర్వాహకులను గ్రామస్థులు అభినందించారు.కార్యక్రమంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యామ్సన్, జిల్లా కోఆర్డినేటర్ నారాయణ, మండల కోఆర్డినేటర్ ఇసువప్ప, ఈశ్వర, హెల్త్ వర్కర్లు గొల్ల విజయలక్ష్మి, సుహాసిని, శారద, సులోచన, మోగులమ్మ, పద్మ, నర్సమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యారాల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మాల్రెడ్డి రంగారెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 (జనం సాక్షి ):** పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకుడు, జీఎస్ సేవా సమితి చైర్మన్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం పసుమాముల పరిధిలోని స్వర్ణ మహల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి శ్రీనివాస్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ గౌడ్ ప్రజాసేవలో మరింత చురుగ్గా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని శుభాకాంక్షలు తెలిపారు.వేడుకలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో స్వర్ణ మహల్‌లో సందడి నెలకొంది.



## డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు బిఆర్ఎస్ పాలనలోనే గ్రహణం?

### అసంపూర్తిగా వదిలేసి కాంగ్రెస్ పార్టీ నిందలా..?

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాన్‌సింగ్

**ధారూర్ అక్టోబర్ 05(జనంసాక్షి) :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశారని ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్‌సింగ్ విమర్శించారు. ఇళ్లతో పాటు రహదారులు,ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిర్మాణాలు అస్తవ్యస్తంగా మారాయని ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇళ్లు అందించకుండా నిర్లక్ష్యం చేసిన గత బిఆర్ ఎస్ ప్రభుత్వాన్ని,అప్పటి ఎమ్మెల్యేను ప్రజలు ప్రశ్నించాలని ఆయన అన్నారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిస్థితి దారుణంగా ఉందని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు.గత ఎమ్మెల్యేగా ధారూర్ మండలానికి ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ధారూర్ మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని మాన్‌సింగ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు.



# ప్రజావాణికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీస్

## అనుమతి లేకుండా డుమ్మా కొడితే చర్యలు తప్పవు

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హెచ్చరిక

**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్5 (జనం సాక్షి)** : ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి అని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. అధికారులు తప్పని సరిగా ముందస్తు పర్మిషన్ తెసుకోవాలని, ప్రజావాణికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు.జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ,ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ప్రభుత్వ ఆద్వర్యంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రదాన్యత ఇవ్వాలని ,ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, సమయానికి హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజావాణికి గైర్హాజరయ్యే అధికారులు తమ శాఖకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సమాధానం ఇవ్వడంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజావాణిలో 103 ఫిర్యాదులు వచ్చాయని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి సోమవారం ప్రతి మండలం లో జరిగే ప్రజావాణి కి సంబంధించిన ఫిర్యాదు లపై మండల స్పెషల్ అడికారులు పూర్తి బాద్యత వహించాలని, ఫిర్యాదుల లిస్టు సబ్మిట్ చేయాలని అడికారులకు ఆదేశించారు."మీ ప్రమాణం" యాప్ లో అడికారులు, సిబంధి అందరూ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్పిసిఇఓ సుధీర్, డిఆర్డిఏ శ్రీనివాస్, జిల్లా అదికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్‌లో జాబ్ మేళాకు అనూహ్య స్పందన

**కొడంగల్, అక్టోబర్ 05 (జనం సాక్షి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొడంగల్ లో ప్రముఖ హెటిరో ఫార్మా కంపెనీ సౌజన్యంతో, కళాశాల ప్లేస్ మెంట్ సెల్ మరియు రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ప్లేస్ మెంట్ డ్రైవ్ కు ఉద్యోగార్థుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్. ఎం. ఓ. డా. సాకేత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొనడం వల్ల వారిలో ఆత్మ స్థైర్యం పెరగడమే గాక మంచి ఉద్యోగాలలో స్థిరపడే గొప్ప అవకాశముందన్నారు. హెటిరో సంస్థ హెచ్. ఆర్ ప్రతినిధులు డి. చరణ్ మరియు పి. ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ హెటిరో సంస్థ ఫార్మా రంగంలో వేగంగా విస్తరిస్తున్నదని, ప్రపంచ వ్యాప్తంగా 140 పైగా దేశాల్లో 200 పైగా అనుబంధ కంపెనీలతో విస్తరించిందన్నారు. ఉత్పత్తి విభాగం, క్యూ. సి మరియు క్యూ. ఎ విభాగాల్లో మంచి ఉద్యోగాలున్నాయని, అభ్యర్థులు




ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హెటిరో వంటి ప్రముఖ సంస్థ తమ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించడం ప్రతిష్టాత్మక మన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల బలీయమైన కెరియర్ అభివృద్ధికి సోపానాలన్నారు. ఇవి విద్యార్థుల మేధకు ప్రముఖ కంపెనీలకు మధ్య వారధిగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు పట్టుదల, మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాలో మొత్తం 64 మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్ టి.రాంబాబు, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా. ఆర్. శ్రీనివాస్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డా.యం. హరిప్రియ, రసాయన శాస్త్ర అధ్యాపకులు డా. వి. శ్రీధర్ కుమార్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

## జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

## మండల, డివిజన్ స్థాయిప్రజావాణికి అధికారులు తప్పకుండా హాజరు కావాలి

**రంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాదినతో ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందన్నారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి సమావేశాలకు సంబంధిత మండల, డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా, సాధ్యమైనంత వరకు స్థానిక స్థాయిలోనే సమస్యలను పరిష్కరించేలా



అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డివిజనల్ ప్రజావాణి సమావేశాల్లో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్రా రెడ్డి, స్టేట్ ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఊరేగింపులో యువకుడి మృతి కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



**ముషీరాబాద్, అక్టోబర్ 5 (జనం సాక్షి):** గణేష్ ఆగమన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట, గందరగోళం కారణంగా యువకుడు మృతి చెందిన కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 5న రాంనగర్‌లో జరిగిన గణేష్ ఆగమన కార్యక్రమానికి 19 ఏళ్ల ఎస్. బద్రీనాథ్ తన స్నేహితుడితో కలిసి వెళ్లాడు. కార్యక్రమంలో భారీ సౌండ్ సిస్టమ్‌లు, లైటింగ్ ఏర్పాట్లు, బాణసంచా కాల్చడంతో జనాల్లో ఒక్కసారిగా గందరగోళం, తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ సమయంలో సౌమ్య హాస్పిటల్ సమీపంలో బద్రీనాథ్ స్పృహతప్పి పడిపోగా గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమ నిర్వాహకుడు మహమ్మద్ మాహెర్ సిద్ధిక్ అహ్మద్ అలియాస్ సిద్ధిక్ (34)కు భారీ ట్రస్సులు, డీజే సౌండ్ సిస్టమ్‌లు, బాణసంచా వినియోగానికి అవసరమైన అనుమతులు లేవని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల హెచ్చరికలను పట్టించుకోకుండా అనుమతులకు మించి సౌండ్ సిస్టమ్‌లు వినియోగించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న సిద్ధిక్‌ను చిక్కడపల్లి ఏసీపీ జి. రణవీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం అక్టోబర్ 4న రాత్రి 11.30 గంటలకు అరెస్టు చేసి నాంపల్లిలోని XVII ACJM కోర్టులో హాజరుపరిచారు. డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, అదనపు డీసీపీ జె. నరసయ్య పర్యవేక్షణలో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జి. రాజగోపాల్‌రెడ్డి తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు.

# ప్రవచనాల వక్త సిద్ధిలింగయ్య స్వామికి అండగా ఆర్బీఓఎల్ సీఈఓ



**తాండూరు ఆక్టోబర్ 5(జనంసాక్షి)** ప్రముఖ ప్రవచనాల వక్త సిద్ధిలింగయ్య స్వామి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. సోమవారం ఆసుపత్రికి వెళ్లి సిద్ధి లింగయ్య స్వామిని పరామర్శించి మనో ధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధిలింగయ్య స్వామి వైద్య ఖర్చుల నిమిత్తం 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. స్వామి త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.ధార్మిక, ఆధ్యాత్మిక సేవలో ఉన్న వ్యక్తికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ఎలిమినేడులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5(జనంసాక్షి)** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారం, డీసీసీ జనరల్ సెక్రటరీ మంకాల శేఖర్ రెడ్డి కృషితో మంజూరైన చెక్కులను సోమవారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పిట్టల యాదగిరి ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.మ్యాకం మధు - రూ.60,000, మంకాల రవీందర్ రెడ్డి - రూ.60,000, ఓలాస్ నరసింహ - రూ.19,500 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలాంటిదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఎలిమినేడు గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో పిట్టల యాదగిరి, పట్నం శివశంకర్, ఎక్కె మహేందర్, ఆర్కే బలరాం, స్వామి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వినతికి పరిష్కారం అధికారులకు కమిషనర్ ఆదేశం

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి




మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 05 (జనంసాక్షి) : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 26 దరఖాస్తులు అందాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి వినతిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా అందిన దరఖాస్తులు టౌన్ ప్లానింగ్ 20, పారిశుద్ధ్య విభాగం 3, ఇంజినీరింగ్ 2, ఎఫ్‌ఏ సెక్షన్ 1, మొత్తం దరఖాస్తులు 26 ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులో సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భరత్‌నగర్ అభివృద్ధికి కొత్త టీమ్

### ఏకగ్రీవంగా వెల్ఫేర్ కమిటీ ఎన్నిక



కీసర, అక్టోబర్ 05 (జనంసాక్షి) : కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సమిష్టిగా కృషి చేస్తామని భరత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు తెలిపారు. నాగారం డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ ప్రజల సహకారం, సూచనలు, ఆశీస్సులతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులకు కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. భరత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షణ్ముఖాన్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, సతీష్, ప్రధాన కార్యదర్శిగా గీతారెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.ప్రవీణ్ కుమార్, అదనపు కోశాధికారిగా కె.మురళి బాధ్యతలు స్వీకరించారు. సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్, సుబ్బమ్మ, లక్ష్మి, స్వప్న ఎన్నికయ్యారు. సలహాదారులుగా ప్రసాద్, కృష్ణారెడ్డి, పవని రెడ్డి, మల్లారెడ్డి, బ్రహ్మయ్య, సదానంద్ రెడ్డి, శివకుమార్, గోవిందరావు నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా లక్ష్మణ్‌రావు, చిన్నయ్య, క్రాంతి, డి.ప్రవీణ్, లక్ష్మీనారాయణ, కీర్తి ఎంపికయ్యారు.

# భజరంగ్ కాలనీలో రూ.34 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

### 430 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్



జవహర్‌నగర్ (జనంసాక్షి): జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని భజరంగ్ కాలనీలో రూ.34 లక్షల అంచనా వ్యయంతో చేపట్ట నున్న 430 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ శ్రీకారం చుట్టారు. కాలనీలో రహదారి సమస్యకు పరిష్కారం చూపేలా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముకేశ్, శోభారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి మనోహర్ రెడ్డి, భజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రాసేన రావు, రాజేష్, గడ్డం శ్రీనివాస్, గారు ఉపేందర్, అంగడి బాలరాజ్, నరేష్, అంగడి కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటర్ల జాబితాలో అక్రమాలపై అఖిలపక్షం పోరు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా విజయవంతం చేయాలి

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాతం నరసింహారెడ్డి



శంషాబాద్,అక్టోబర్5(జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటర్ల జాబితా విషయంలో పారదర్శకతకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగురింత పారిజాతం నరసింహారెడ్డి ఆరోపించారు. సోమవారం శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏఐసీసీ, సిపిఐ సిపిఎం ఇండియా కూటమి పిలుపు మేరకు 'సేవ్ డెమోక్రసీ వీక్' కార్యక్రమంలో భాగంగా అఖిలపక్ష సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా జరగడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అఖిలపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ భీమ్ భరత్పీసీసీ మెంబర్ ఏనుగు జంగారెడ్డిసానెం శ్రీనివాస్ గౌడ్, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, ఎం.ఎ. ఖలీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ, శివకుమార్, పుస్తకాల నర్సింగ్ రావు, ఒరుగంటి యాదయ్య, దూడల వెంకటేష్ గౌడ్, దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోర్సులో చేరేందుకు అక్టోబర్ 13 గడువు

### విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు



కాప్రా, అక్టోబర్ 5 (జనం సాక్షి) : డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి బిఏ, బికాం, బిఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బిఎల్ ఐసి, ఎంఎల్ ఐసి డిప్లొమా అడ్మిషన్ల గడువును అక్టోబర్ 13 వరకు పొడగించినట్టు విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ (LSSB) డా. వై. వెంకటేశ్వర్లు తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీలో కొత్త పిజి కోర్సులు ఎంఏ (ఎడ్యుకేషన్), ఎంఏ ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్), ఎంఎస్ డబ్ల్యూ (మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్), ఎమ్మెస్సీ, జాగ్రఫీ, ఎమ్మెస్సీ, కంప్యూటర్ సైన్స్ ఎమ్మెస్సీ, స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ, డేటా సైన్స్ కోర్సులు ప్రవేశపెటుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పిజీ ఆన్ లైన్ కోర్సులు బీకాం తెలుగు మీడియం, బీకాం ఇంగ్లీష్ మీడియం, ఎంఏ తెలుగు, ఎంకామ్, ఎంబిఏ కోర్సులకు ఆన్ లైన్ లో అడ్మిషన్లు పొందవచ్చాన్నారు. మరిన్ని వివరాలకోసం www.braouonline.in, admission registration వెబ్ సైట్‌లో login అయి దరఖాస్తు చేసుకున్న తరువాత అభ్యర్థులు ఎంచుకున్న స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

### హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్

### వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

### హెచ్‌పీవీ టీకాలు, ఎన్‌సీడీ సర్వే లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలి

హైదరాబాద్, అక్టోబర్ 05 (జనంసాక్షి) : ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా లోని నాంపల్లి క్లస్టర్ పరిధిలోని సయ్యద్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల సేవలు, వివిధ రికార్డులు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి రోజు నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ నిర్వహించి సమాచారాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో ఔషధ నిల్వలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు అర్హులైన బాలికలకు టీకాలు వేగంగా అందించి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. గర్భిణుల సంరక్షణ, శిశువుల టీకాలు, అంటువ్యాధుల నివారణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఇంటింటి ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో నాంపల్లి క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.మురళీధర్, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



